# ఇంద్రధనుస్సు

## ౧

"మీకేమీ అభ్యంతరం లేదుకదా ?" అని ఆఖరి స్పెన్సరు చుట్టని బైటికితీస్తూ అడిగాడు రాజారాం.

ఆశ్చర్యంగా కనుబొమలు ఎగురవేస్తూ, తనతో మాటలు కలపటానికి వేసిన ఎత్తు అని తెలుసుకుని కళ్లు పెద్దవి చేసి అతని కేసి చూచింది ఆ యువతి.

వాళ్లిద్దరే ఆ ఫస్టుక్లాసు పెట్టెలో ప్రయాణం చేస్తున్నారు. ఒకరికేసి ఒకరు చూసుకున్నారు కాని ఇంతవరకూ ఒకరి నొకరు పలకరించుకోలేదు.

ఇందాక అతను పొగమబ్బులు గుప్‌గుప్ మని వొదులుతూ ఇంజన్‌లాగా సిగార్ తాగుతున్నప్పుడు ఆవిడ చేతిరుమాలుతో ముక్కు మూసుకుని ఆముదం తాగుతున్న ముఖం పెట్టింది. అది గమనించటంవల్లనే రాజారాం ఈసారి ఆవిడ అనుమతి లేకుండా చుట్ట వెలిగించ దలుచుకోలేదు. రైలుపెట్టెలో తోటి బాటసారుల అభిమతం కనుక్కుంటే కాని పొగతాగవద్దనే హితోపదేశంకూడా అతనికళ్ల పడింది. అంతేకాక ఒంటరిగా ప్రయాణం చేస్తున్న ఆ వనిత ఎవరో తెలుసుకోవాలనీ ఎక్కడో చూసిన ముఖంలాగా వుందనీ రాజారాం చాలా సేపటినుంచీ అనుకుంటున్నాడు.

"మౌనం అర్ధాంగీకారంగా భావించవచ్చునా అండీ ?" అంటూ కొంటెగా రాజారాం అగ్గిపుల్ల గీశాడు. మబ్బులు బయలు

దేరినయ్. ఆవిడ ఉక్కిరిబిక్కిరై వస్తున్న దగ్గుని ఆపుకుంటూ "మీకు పుణ్య ముంటుంది. అవతల పారెయ్యండి" అంది. కిటికీ లోంచి ఆ ధూమకాష్టాన్ని విసరి పారేసి "మిమ్మల్ని ఎక్కడో బాగాచూసినజ్ఞాపకం వుందండీ! మీరు కాకినాడ కాలేజీలోచదివారా?"

"అవును. ఇందాకటినుంచీ నాక్కూడా మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగానేవుంది. ఆలోచిస్తున్నాను" అని చిరునవ్వుతో అతని వంక చూసింది. పంకా విసురుతున్న గాలికి నొక్కులుగా వున్న ముంగురులు అందంగా విశాలమైన నుదుటిమీద ఆడుతున్నయ్. ఆకాశంలో వెలిగే ఒంటరి నక్షత్రంలాగా తిలకరేఖ మెరుస్తోంది. ధరించిన పలచటి నల్లషిఫాన్ చీరెలోంచి మిసమిస మెరిసే శరీర చ్ఛాయ తొంగి చూస్తోంది. మెళ్లో రాళ్ల నెక్‌లెస్ తళుక్కు మంటోంది. ముచ్చటగా చుట్టిన సిగలో అర్ధచంద్రాకారంగా జాజిపూలచెండు ముసిముసినవ్వులు ఒలకబోస్తోంది. ఖరీదైన చేతి సంచీ ఎత్తుమడమల మొఖమల్ జోళ్లూ, కళ్లఅందాన్ని దాచివేస్తున్న నల్లకళ్లజోడూ ఆ వనిత నాగరికస్థాయిని గర్వంగా చాటుతున్నయ్.

ఆ నల్లకళ్ల జోడుని తీసి "ఇవాళ రైలు ఇక్కడినుంచి కదలదా యేమిటి?" అని అడిగింది. ఆ విశాలమైన కళ్లలోంచి కాటుకసోయగంతో బయలుదేరిన తళుకుచూపు అతనిహృదయాన్ని చురుక్కున గుచ్చి ఇప్పటికైనా జ్ఞాపకం వచ్చిందా అని ముదల కించింది. ఎక్కుపెట్టిన విల్లులాగా వంగిన కనుబొమలూ, హృద యంలో అగాధ తలాలని కాంతికిరణాలతో చల్లగా తాకే ఆ చూపు, వాన వెలవగానే ఆకాశంలో విరిసే వెన్నెలలాంటి చిరునవ్వూ— సందేహం దేనికి? అప్పటికంటే కొంచెం లావయింది. కాని అప్పటి యువకహృదయాలన్నిటిలోనూ సింహాసనం ప్రతిష్ఠించు కున్న లావణ్యం మాత్రం రూపంలో ఇంకా రాజ్యం చేస్తూనేవుంది.

"మీ పేరు మనోరమకదూ? ఇందాకటినుంచీ మీ కళ్ల జోడు నన్ను చాలా మోసగించింది." అన్నాడు రాజారాం కొంచెం చొరవచేసుకుంటూ.

"అవును. మీకింకా జ్ఞాపకం వున్నా నన్నమాట!"

"భలే వారండీ! కాలేజి యానివర్సరీ ఉత్సవంలో మనిద్దరం చిత్రాంగద నాటకంలో వేషాలు వేశాం గుర్తుందా?"

"గుర్తులేకేం? కాని ఆనాటి అర్జునుడు చుట్ట తాగినట్లు గుర్తులేదు" అంది మనోరమ.

"అప్పటికి నేనింకా గిరీశంగారి శిష్యుణ్ని కాలేదులెండి!" అని నవ్వాడు రాజారాం.

"మీ రిప్పుడేం చేస్తున్నారు?" అని కుశలప్రశ్న వేసింది మనోరమ.

రాజారాంకి గొంతున పచ్చివెలక్కాయ పడింది. ఏం చెబుతాడు? పుట్టిన ప్రతివాడూ ఏదో ఒకటిచేసి తీరాలనే నియమం ఎక్కడుంది? "ప్రస్తుతం ప్రయాణం చేస్తున్నాను...." అని తెలివిగా తప్పుకున్నాడు రాజా.

"మరి మీరో?"

"నేను అడ్వొకేట్‌గా ప్రస్తుతం గుంటూరులో ప్రాక్టీసు చేస్తున్నాను. మహిళాసంఘానికి నిన్నటివరకూ అధ్యక్షురాలిని. ఇవాళే రాజీనామా చేశాను. ఆడవాళ్లంత అసూయాపరులు లోకంలో లేరు. నాకు పేరువచ్చి పోతున్నదని ఎందరో కుళ్లి పోతున్నారు. అందుకే ఇవాళనుంచీ సంఘసేవాసంస్థ లన్నిటితో తెగతెంపులు చేసుకున్నాను. హాయిగా గాలి పీల్చుకోగలుగుతున్నాను."

"మీ నాన్నగారు ఎక్కడ వుంటున్నారు?"

"రిటైరయారు. ఇప్పుడు మేమిద్దరం గుంటూరులో వుంటున్నాం. మీ రెక్కడికి వెళ్తున్నారు?"

"ఫలానా చోటికని లేదు. తోచకబయలుదేరాను." అంటూ రాజారాం కిటికిలోంచి బైటికి చూశాడు. సిగ్నలువాలే ఆశలేదు. రైలు అక్కడే తిష్ఠవేసింది. మబ్బులు కమ్ముకుని తుఫానుగాలి సాగింది. వంతెనమీదినుంచి వరదనీరు పారుతున్నదనీ, వరదతీస్తేకాని బండి బయలుదేరదనీ గార్డు చెప్పాడు. ఆశగా కిటికీలోంచి చూడటం మానేసి, కుంభవృష్టి లోపలకి కొట్టకుండా తలుపులు వేసుకుని, లైట్లు వెలిగించి ప్రయాణీకులంతా పెట్టెల్లో ఒదిగి కూచున్నారు.

"పొద్దున్నే కాఫీ అలవాటు. తల పగిలిపోతోంది" అని రాజారాం రెండు చేతుల్లోనూ తల పెట్టుకుని తపస్సు చెయ్యటం మొద లెట్టాడు.

"చెప్పారు కారేం? నా ఫ్లాస్కులో కొంచెం వున్నట్లుంది. చూస్తాను." అంటా మనోరమలేచి ఫ్లాస్కులోకాఫీ కప్పులో పోసి అందించింది.

కాఫీ కంటపడగానే ప్రాణం లేచివచ్చింది. గత కాలంమీది మసకతెరలు తొలగిపోయినయ్. తుఫాను ఉద్ధృతం ఎక్కువైన కొద్దీ, పట్టాలమీద బండి బొల్తా కొట్టేటంత భయంకరంగా ఊగిపోయినకొద్దీ వాళ్ళిద్దరూ దగ్గరగా ఇంకా దగ్గరగా వచ్చారు. ఒకే ఆపదలో చిక్కు కోవటంవల్ల ఇద్దరూ ఆత్మీయులైపోయారు. కాలేజిలో పరిచయం మొదటివానజల్లు తగలగానే నెర్రలిచ్చిన నేలలోంచి పరిగెత్తుకొచ్చే పరిమళంగా వాళ్ళిద్దరి మనస్సులనీ మాధుర్యంతో నింపివేసింది.

సంభాషణవల్ల మనోరమని గురించి చాలా విషయాలు తెలిసినయ్. అవివాహితురాలుగా వుండి సంఘసేవికగా అఖిలభారత

ఖ్యాతి పొందాలనే ఆశతో ఇంతకాలమూ పనిచేసింది. నిన్నటితో మనస్సు విరిగిపోయింది. తను నెలకొలిపిన సంస్థలో నున్న సభ్యులంతా తనమీద అవిశ్వాసం ప్రకటించటానికి పూనుకున్నారు. మర్యాదగా తనే తప్పుకుని, బాధ్యతలన్నీ దులిపేసుకుని ఇంటికి బయలుదేరింది. గృహిణిగా జీవితం ఆరంభిద్దామనే సంకల్పం ఇన్నాళ్లకి నిస్పృహతో మండుతున్న మనోరమ హృదయంలో తలఎత్తింది. అదృష్టవశాత్తూ రాజారాం రైల్లో కలవటం, వరద వల్ల గంటలతరబడి రైలు ఆగిపోవటం, ఫస్టుక్లాసు పెట్టెలో తమ రిద్దరే ప్రయాణీకులు కావటం—అంతా కలగా కథగావుంది. తన చుట్టూ ఏదో పన్నాగం అల్లుతున్నట్లనిపించింది. తన జీవిత నాటకములో నూతన రంగానికి హంగులన్నీ తయారై తెర లేవబోతున్నట్లనిపించింది.

గమ్యంలేని యాత్రకి బయలుదేరిన రాజారాం చివరకి గుంటూరు చేరుకున్నాడు.

మనోరమ ఇంటికే అతిథిగా వెళ్లక తప్పలేదు.

## ౨

"రమా !"

"ఏమండీ ? పిలిచారా ?" అంటూ అల్లుతూన్న వూలు మేజోళ్లు మధ్యలో వదలి పేముకుర్చీలోంచి బరువుగా లేచి వచ్చింది మనోరమ. రాబోయే శిశువుకోసం కాబోయే తల్లి దుస్తులు తయారుచేస్తోంది. అందులో అపూర్వమైన ఆనందం కనిపించి మనోరమని ఉద్రూత లూగిస్తోంది. అటువంటి ఆనందం ఉపన్యాసాలలోనూ ప్రదర్శనలలోనూ మునుపెన్నడూ ఆమె హృదయం చవిచూడలేదు.

"అల్లా కాస్సేపు రింగురోడ్డుకి షికారు వెళ్లివద్దాం పద" అని రాజారాం అన్నాడు.

మనోరమ ముస్తాబు చేసుకోవటానికి వెళ్లింది. "రావోయ్ అల్లుడూ! ఒక ఆట వేసుకుందాం" అంటూ మనోరమతండ్రి చదరంగం సామానుతో వచ్చాడు. పింఛను పుచ్చుకున్న దగ్గర నుంచీ చదరంగంతోనే కాలం గడుపుతున్నాడు. ఇదివరకు కూతురు ఇంట్లో లేనప్పుడు ఒక్కడే ఆడుకోవలసి వచ్చేది. పనిలేని అల్లుడు దొరకటం వల్ల ఇప్పుడాయనకి ఆటకి రెండోచెయ్యి దొరికింది.

"షికారు వెళ్దామని ప్రోగ్రాం వేసుకున్నామండీ-" అని రాజారాం చెదురుతూ అన్నాడు.

"ఆల్‌రైట్ గోఎహెడ్! నువ్వు తిరిగి వచ్చేదాకా పేషెన్స్ ఆడుకుంటూ వుంటాలే" అని బుజంమీద చెయ్యివేసి "ఇవాళ డ్రయివరు రాలేదు. నీకువచ్చునుగా" అన్నాడు.

"అసలు డ్రయివరు అనవసరం మానిపించమని ఎంత మొత్తుకున్నామీరు వినటంలేదు. నాకు బాగా అలవాటే-" అన్నాడు రాజారాం.

ఇంతలో రమ ముస్తాబు పూర్తిచేసుకుని పరిమళ భరితమైన మందపవనంలాగా గదిలోకి వచ్చింది, మాతృత్వం ఆమె అందానికి నిండు తనాన్ని కల్పించింది. పెదవులమీద మంద హాసంలో బడలికతోపాటు బలీయమైన ఆకర్షణకూడా కనిపిస్తుంది.

ఇద్దరూషికారు బయలుదేరారు. రాజారాం కారునడుపు తుంటే పైప్రాణాలు పైన ఎగిరిపోతున్నయ్. ఏక్షణాన ఏ ప్రమాదం జరుగుతుందో అనే భయం గుండెల్లో గుబ్బాలు పరిగెత్తిస్తున్నది. "ఇంటికి పోదాం వెనక్కి తిప్పండి" అని బతిమాలుకున్నా విన

కుండా రాజారాం కారుపోనిస్తున్నాడు. తాగినవాడి మనస్సులాగా పోతోంది కారు. ఎదురుగా వచ్చే సైకిలు రిక్షాలూ, చిన్నకార్లూ, సైకిళ్ళూ ఈ కారువచ్చి ఢీకొడుతుందేమోనని బెదిరి తమంతట తామే తప్పుకుని చరచరా సాగి పోతున్నట్లనిపించింది మనోరమకి. కారు శరవేగంతో గోతాలమిల్లుదాటి రైలుగేటు దగ్గరికి చేరు కుంటోంది. ఆ వేగాన్ని అదుపులో పెడదామని బ్రేకు ఎంత నొక్కినా పడలేదు. రైలు రాబోతోంది. గేటుమూసివుంది. కారు వచ్చి తీవ్రంగా గేటుకి గుద్దుకుని గిర్రున తిరిగి కిందకి పడి పోయింది. అనంతమైన కాలంలో అగాధమైన రసాతలానికి అణగారి పోతున్నట్లు కళ్ళుగిర్రున తిరిగినయ్. "అమ్మా!" అని కెవ్వున కేక వేసింది మనోరమ. ముందున్న అద్దం ఫట్టున పగిలి చేతకాని గొప్పలికి పోవద్దు అని హెచ్చరిస్తున్నట్లు గీసుకుపోయి నెత్తురు చిమ్మింది. రాజారాంకి తల తిరిగిపోయింది.

స్పృహవచ్చేసరికి ఇద్దరూ ఆసుపత్రిలో వున్నారు. రాజారాం తెల్లారేసరికి పట్టీలు వేసుకుని తేలిగ్గా లేచాడు. కాని మనోరమ చాలా ప్రమాదస్థితిలో పడింది. కారు గుద్దుకున్నప్పుడు అయిన చప్పుడూ, అప్పుడు కలిగిన భయమూ లోపలున్న శిశువుమీద పనిచేసినయ్. శస్త్రచికిత్స చేయవలసి వచ్చింది. పదిరోజుల దాకా రమ ఆసుపత్రిలోనే వుంది. ప్రాణాపాయం తప్పి బైటపడింది. వెయ్యికళ్లతో ఎదురు చూసిన శిశువు చేతికి అందలేదు. అంతే కాదు. ఆపరేషన్ ఫలితంగా రమ జీవితంలో ఇంకెన్నడూ తల్లి అయే అవకాశం లేకుండా పోయింది. ఈ విషయాన్ని లేడీడాక్టరు చెప్పినప్పుడు ఏదో రమణీయ స్వర్గంలోంచి తనని గెంటివేసి ద్వారాలు శాశ్వతంగా మూసివేసినట్లు రమ బాధపడింది.

ఆ బాధ రమ హృదయంలో ఆరనిజ్వాలగా రగులుతున్నది. ఈ దురదృష్టానికంతకీ కారకుడైన రాజారాంమీద అస్తమానమూ కొరకొర లాడుతుంది. ఆనందగీతంగా సాగుతున్న వాళ్ల దాంపత్యంలో పెద్ద అపశృతివచ్చి పడింది. పండువెన్నెలతో నిండి తొణికే వారి జీవితాకాశంలోకి భీకరమైన కారుమబ్బు వచ్చి కదలకుండా నిలబడింది.

మనమడితో జీవితంలో సాయంకాలాన్ని సరదాగా గడిపి వేద్దామనుకున్న తాతగారి ఆశలన్నీ పేకమేడల్లాగా కూలి పోయినయ్. ఆయనక్కూడా రాజారాంమీద కోపం బయలు దేరింది.

ఇంట్లో ముళ్లమీద వున్నట్లుగా తోచి రాజారాం చాలా బాధ పడ్డాడు. రమతో మాట్లాడాలంటే భయం వేస్తోంది. సౌమ్యంగా జవాబు చెప్పటమే మానేసింది. అసలు తనని పెళ్లిచేసుకోటమే తొందరపడిచేసిన పొరపాటుగా భావిస్తున్నట్లు ఆమె మౌనానికి భాష్యం చెప్పుకున్నాడు రాజారాం. అంపశయ్యమీద పడుకున్నంత బాధగా వుంది.

రాత్రి భోజనాలయినయ్. మేడమీద ఆరుబైట పడక కుర్చీలో వాలి చీకట్లోకిచూస్తూ అంతుదొరకని ఆలోచనల్లో తేలి పోతోంది రమ. అనాదినుంచీ జగత్తులో సుఖదుఃఖా లన్నిటినీ తరగని కుతూహలంతో చూస్తున్న రెప్పవాల్చని ప్రేక్షకులలాగా నక్షత్రాలు మలమల మెరుస్తున్నయ్. పొలాలలోంచి నక్కల కూతలూ కీచురాళ్లరొదలూ నిశ్శబ్దాన్ని పారదోలుతున్నయ్. కదిలే దీపాల తోరణంలాగా చీకట్లో రైలు చరచరా వెళ్లిపోతోంది.

"రమా !"

బదులులేదు. నిద్రపోతున్నదేమోనని ముఖంమీదికి టార్చి వేశాడు రాజారాం. కళ్లు చిట్లించుకున్నది కాని పెదవి కదపలేదు.

"నేను ఇన్నాళ్లనుంచీ నీతో ఒక రహస్యం చెప్పకుండా దాచాను. చెప్పాలని ఎన్నోసార్లు నోటిదాకా వచ్చి సంకోచంతో నా మాటలు కంఠంలోనే ఆగిపోయినయ్—" అని ఉపోద్ఘాతం చెప్పి రాజారాం ఆశగా రమకేసి చూశాడు.

చివాలున కుర్చీలోంచి లేచి "అక్కర్లేదు. చెప్పక్కర్లేదు" అంటూ గదిలోంచి తుంగచాప తెచ్చుకుని నేలమీద పరుచుకుని కళ్లుమూసుకుంది.

ముఖాన కొరడాతో ఛళుక్కున చరిచినట్లనిపించి రాజారాం నివ్వెర పోయాడు.

తెల్లారి లేచి ఇల్లంతా గాలించారు. రాజారాం పత్తాలేదు. అతని తాలూకు వస్తువొక్కటి కూడా ఇంట్లో కనిపించలేదు.

రమ కళ్లలో నీళ్లు గిర్రున తిరిగినయ్. తను పెళ్లినాడు కలిపి తీయించుకున్న ఫొటోలో కర్పూరదండలతో నవమన్మధుడిలా నవ్వుతున్న రాజాకేసి చూడగానే ఆపుకోలేని ఆక్రోశం పెల్లుబికి వచ్చింది.

## 3

"ఇవాళ టపాలోకూడా జవాబు రాలేదా ?" అన్నాడు తండ్రి. భార్యాభర్తలమధ్య తగాదాలు అలలమీద అక్షరాలను కున్నాడు. కాని వ్యవహారం చివరకి శృతిమించి రాగాన పడు తుందని అనుకోలేదు.

"లేదు నాన్నా. వస్తుందనే ఆశలేదు కూడా" అంది బరువుగా రమ.

"అయితే ఇంకా చూస్తూ కూచోటానికి వీల్లేదు. మనం వాళ్ళవూరు వెళ్దాం పద" అన్నాడు.

"వాళ్ళవూరు తీసికెళ్ళమని ఎన్నిసార్లడిగినా నన్ను రమ్మన లేదు. తను వెళ్ళినప్పుడల్లా నేనూ వస్తాననే దాన్ని. ససేమిరా వద్దనే వారు" అంది గతాన్ని నెమరువేస్తూ.

"ఆఁ. ఏంలేదు. వాళ్ళ పల్లెటూరిని చూసి నువ్వు నవ్వి పోతావేమోనని రాజా భయపడి వుంటాడు. అంతేనమ్మా! ఇంకేం కారణం వుంటుంది?"

"ఏమో నాన్నా! నాకు అనుమానంగా వుంది. ఆ తెల్లారి వెళ్ళిపోతారనగా రాత్రివేళ నాతో ఏదో రహస్యం చెప్పా లన్నారు. బుద్ధితక్కువదాన్ని విసుక్కున్నాను. ఇంత ముంచుకు వస్తుందను కోలేదు—" అంటూ మనోరమ చెంగుతో కళ్ళు ఒత్తుకుంది.

"దిగులు పడకమ్మా! ఎక్కడున్నా గాలంవేసి గాలించి రాజాని లాక్కొస్తాను. ఇంత మాత్రానికే ఇల్లు విడిచి పారిపోయే వాడు ఈ లోకంలో ఎందుకు పనికొస్తాడమ్మా? ఎన్ని ఢక్కా మక్కీలు ఎదుర్కొంటే మనిషి ఒడ్డు ఎక్కుతాడు!" అని తండ్రి ప్రయాణానికి సన్నాహం చేస్తున్నాడు. రమ కూడా వెళ్ళటమా మానటమా అనే సందిగ్ధంలో కొట్టుకుంటోంది. రాజా తనని నిరాకరిస్తే? తన మాట పెడచెవినిపెట్టి తనని తిప్పిపంపివేస్తే? అంతటి అవమానాన్ని తను సహించకలదా? అయినా తనకి తెలియకుండా రాజా ఏదైనా రహస్యాన్ని నిజంగా దాస్తున్నా డేమో? అతను ఎన్నోసార్లు చెప్పబోయి తటపటాయించి దిగమింగుకున్నాడు. తమ పెళ్ళినాడు చెప్పబోతే ఇప్పుడుకాదని తనే నవ్వులతో అతని సంకల్పాన్ని చెదరగొట్టివేసింది. నిజంగా

ఏదైనా రహస్యం తమ ఇద్దరిమధ్యా దాటలేని అఘాతాన్ని కల్పిస్తుందేమో ? ఆ భయంతోనే రాజా పారిపోయాడేమో ?

లేకపోతే తను చేసిన తప్పిదమేముంది ? ఎందుకు చెప్పకుండా మాయంకావాలి ? నలుగురికీ తను ఎంత చులకనైపోయింది ? భర్త పలాయనానికి తనే కారణమని ఆడిపోసుకునే వాళ్లు ఎందరున్నారో ? నిజానికి తనవల్ల జరిగిన అపచారమేముంది ? ఏ తప్పూ లేకుండానే ఇంత శిక్ష తనకి ఎందుకు తగిలించాలి ?

అనురాగం ఒకపక్కనా, అభిమానం ఒకపక్కనా మనోరమ హృదయంలో సాగరమథనం సాగించినై. కారు వాకిట్లో నిలబడింది. తండ్రిముందే ఎక్కి గట్టిగా హారన్ నొక్కుతున్నాడు. మనోరమ చివరకి వెళ్లటానికే మొగ్గి వాకిట్లోకి వచ్చింది.

"అమ్మా ! ఈ కుక్కని లోపలికి పిలవండి. కరుస్తుందేమోనని భయంగా వుంది." అని గేటులో ఎవరో కేకపెట్టారు.

"టైగర్ ! టైగర్ !" అని పిలిచేసరికి అరిచేకుక్క తోక ఆడించుకుంటూ నాలుక వేళ్లాడవేస్తూ రమదగ్గరికి పరిగెత్తుకొచ్చింది.

గేటులోంచి ఒక స్త్రీ బెదురుతూ ఒకొక్క అడుగే వేస్తూ వస్తోంది. ఆవిడవేలు పట్టుకొని నీలంరంగు సిల్కులాగూ, చొక్కా తొడుక్కున్న అయిదేళ్ళ కుర్రాడు గంతులువేస్తూ లోపలికి వస్తున్నాడు. సెలయేరులాగా కుర్రాడి నవ్వుదొంతరలు తోటంతా పరిగెడుతున్నయ్. సీతాకోకచిలుకలను పట్టుకోవాలని చెయ్యి వదిలేసి దూరంగా పరిగెత్తబోతుంటే బలవంతాన కుర్రాణ్ని ముందుకి గుంజుకు వస్తోంది ఆ స్త్రీ. చూడగానే మనోరమ హృదయం ఆ కుర్రాడివైపుకి ఒక్క గంతువేసింది.

"మధ్యాహ్నం బయలుదేరుదాం నాన్నా!" అని మనోరమ ప్రయాణాన్ని వాయిదావేసి ఆ ఆడమనిషినీ కుర్రవాడినీ లోపలికి తీసుకు వెళ్లింది.

వచ్చినవాళ్లు ఎవరో అర్థంకాక, సిద్ధమైన ప్రయాణం ఎందుకు ఆపిందో తెలియక తండ్రి తికమకపడ్డాడు. మనోరమ స్వభావమే అలాటిది. ఏక్షణాన ఏ పనిచేస్తుందో ఎవరూ ఊహించ లేరు. చిన్నప్పుడే తల్లిపోవటం తండ్రికి ఒక్కతే కూతురుకావటం-అందువల్ల రమ ఆడింది ఆటా, పాటా!

ఆ కుర్రాడిజేబులో ఒక జాబు వుంది. అది రాజాసంతకమే. చదువుకుని ఉప్పొంగిపోయి హృదయానికి అదుముకుని కుర్రాణ్ని ముద్దులతో ముంచెత్తింది.

"నీ పేరేమిటి బాబూ?" అని కుర్రాణ్ని రెండుచేతుల్తో పైకి ఎగరేసింది. "బాబు!" అని కిలకిల నవ్వుతూ చెప్పాడు కుర్రాడు. చిరునవ్వుకి బుగ్గలు సొట్టలుపడి ముత్యాలలాటి పళ్ల వరసా, ఉంగరాలజుట్టూ ముద్దులు మూటకట్టినయ్.

"నీకేం ఇస్తే ఋణం తీరుతుందమ్మా?" అని రమ వచ్చిన స్త్రీని అడిగింది.

"మీరు కుర్రాణ్ని కంటికి రెప్పలాగా చూసుకుంటే నాకదే పదివేలు తల్లి!" అంది ఆవిడ. భోజనంచేసి వెళ్లమని ఎంత బతిమాలినా ఆగకుండా వెళ్లిపోయింది. ఆవిడవూరూ రాజారాం వూరూ వొకటేనట!

౪

"ఏం! రమా, ఇప్పుడు నీకు పెంపుడుకొడుకే ప్రపంచం లాగుందే! ముసలాణ్నికూడా మరిచిపోయావ్!" అన్నాడు

తండ్రి నవ్వుతూ మోకాళ్లకి అమృతాంజనం మర్దన చేసుకుంటూ. "ఈముసలికుర్రాణ్ణికూడా ఒకకంట కనిపెట్టకపోతే ఎల్లాగమ్మా?"

"ఆవిడకి ఇప్పుడు ఇంకోసంగతే పట్టటంలేదండి? ఈ కుర్రాణ్ణి చూస్తే నాకు భలే అసూయగావుంది." అంటూ రాజా మేడమీదినించి దిగాడు.

"కుర్రాడు అదృష్టవంతుడోయ్!" అన్నాడు తాత.

"అదృష్టవంతుడు కాకపోతే తల్లిలేకపోయినా ఇంతగారాబం ఎల్లా జరుగుతుంది?" అని రాజా కుర్రాణ్ణి ఎత్తుకున్నాడు.

"మరి వీణ్ణి ఇక్కడ దిగబెట్టి వెళ్లినమనిషి వీడి తల్లి కాదా?" అంది మనోరమ.

"ఈ నిర్భాగ్యుడు పుట్టగానే తల్లి చచ్చిపోయింది. అప్పటి నుంచీ ఆవిడ పెంచింది. ఇప్పుడు వాడి అదృష్టంపండి నీ ఒళ్లోకి వచ్చి పడ్డాడు రమా!"

"పాపం! వీడితండ్రి ఏమైనాడో?" అంది రమ కుర్రాడి తల దువ్వుతూ.

"భార్య పోగానే మనశ్శాంతికోసం తీర్థయాత్రలకి బయలు దేరాడుట. ఇంతవరకూ తిరిగి రాలేదుట. ఏమైనాడో ఎవరికీ తెలియదుట...."

"ఇంత ముద్దులు మూటకట్టే కొడుకుని చూడకుండా ఎల్లా వుండగలుగుతున్నాడో! వాడిదెంత రాతిగుండో?" అంటూ ఊగే గుఱ్ఱం మీద కుర్రాణ్ణి ఊపుతోంది.

ఏదో చెప్పబోయి రాజా పెదవులు మళ్లీ ఆగిపోయినయ్.

కుర్రాడు వాళ్లిద్దరి హృదయాలకీ ఉయ్యాలకట్టి అందులో ఊగుతున్నాడు. వాళ్ల కాపురం స్వర్గాన్ని తాకుతున్న స్వర్ణగోపురంగా మెరుస్తున్నది. ఆనంద ధామంగా వాళ్ల సంసారం మారిపోయింది.

ఆరోజు కుర్రాడి అక్షరాభ్యాసం అతివైభవంగా జరిగింది. బీదపిల్లలందరికీ కొత్తపలకలూ కొత్తగుడ్డలూ పంచిపెట్టారు. ఆటలతో పాటలతో నవ్వులతో రోజంతా గడిచిపోయింది.

రాజా మేడమీద వెన్నెట్లో పడుకున్నాడు. కుర్రాడు పక్కలో పడుకుని నక్షత్రాలపేర్లు చెబుతున్నాడు. మంచినీళ్ల చెంబుతో మేడమీదకి వచ్చిన రమ "ఎంత పచ్చి మోసగాళ్లండీ మీరు?" అంది.

రాజా ఉలిక్కిపడి "ఏం? నేనేంచేశాను?" "ఇన్నాళ్లూ ఎందుకు చెప్పలేదు? ఇవాళ మీ వూరునుంచి వచ్చిన వదినగారు అంతా చెప్పారులెండి. దొంగదొరికి పోయారు!" అని లేని కోపాన్ని అభినయిస్తూ కుర్రాణ్ని ఎత్తుకుని గదిలోకి వెళ్లి పోయింది.

"చెప్పాలని ఎన్నోసార్లు అనుకుని కూడా చెప్పలేక పోయాను...." అని తలవంచుకున్నాడు రాజా!

"రెండోపెళ్లి మొగుడైతే చేసుకోనేమోనని దాచిపెట్టారా పాపం?"

"పోనీ అల్లాగే అనుకో! వాడు నీ హృదయం దొంగి లించాడు కనుక చెప్పినా ఫరవాలేదనుకున్నాను. ఇవాళ నేనే చెబుదామనుకున్నాను. నాకంటేముందు మా అక్కయ్యే చెప్పింది. పిల్లాణ్ని చిన్నప్పటినుంచీ పెంచిన మనసుకనక వాడి అదృష్టాన్ని చూచి మా అక్కయ్య ఎంతో మురిసి పోతున్నది!"

"అక్కా తమ్ముడూ కలిసి భలే నాటకం ఆడారులెండి. ముందేతెలిస్తే ఏంచేసేదాన్నో?" అంది కోపంగా.

"ఇప్పుడేం చేస్తావు రమా? వాడు నా మొదటిభార్య కొడుకని తెలిశాక గెంటేస్తావా?"

"ఈ రాజానీ గెంటివెయ్యలేను, ఆ చిన్నరాజానీ గెంటి వెయ్యలేను .... వాడు వచ్చాక నేను ఈ లోకంలో ఎందుకు పుట్టానో ఎందుకు బతకాలో అర్థమవుతోంది." అంటూ మెరిసే కళ్లతో మనోరమ భర్తకేసి చూసింది.

రాజారాం హృదయం ఆనందశిఖరంమీద నాట్యంచేసింది. ఆకాశంలో కళ్లు జిగేలుమనే మెరుపు తళుక్కుమన్నది. నిద్రలో బాబు ఏదో కలవరిస్తున్నాడు....

"ఇదామీరు ఇన్నాళ్లనించీ చెప్పకుండా దాచిన రహస్యం ?" అంటూ లేచి రమ లైటు ఆర్పివేసింది.

వాళ్లిద్దరి హృదయాలనీ సంధించిన ఇంద్రధనుస్సు బాబు.